క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని సవరవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున సవరవిల్లి, రావాడ, కవులవాడ, తూడెం, జమ్మయ్యపేట, బసవపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్‌కే మస్తాన్‌వలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి రూ.82 వేలు విరాళం



హెచ్‌ఎం పీఏబీహెచ్‌ఎస్ శ్రీనివాసరావుకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భోగాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి కోసం రూ.82 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల హెచ్‌ఎం పీఏబీహెచ్‌ఎస్ శ్రీనివాసరావుకు ఆదివారం అందజేశారు. విరాళం ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి రూ.50 వేలు, పోలిరెండి గోపి రూ.5 వేలు, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, గిరి రూ.10 వేలు, బొద్ద భాస్కరరావు రూ.2 వేలు చొప్పున అందజేశారు. వారితో పాటు ఎంపీడీఓ అప్పలనాయుడు రూ.5 వేలు, ఈఓపీఆర్డీ సురేష్ రూ.5 వేలు,పంచాయతీ సెక్రటరీ రామకృష్ణనాయుడు రూ.3 వేలు, ఏపీఎం రమణ రూ.2 వేలు హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాశ్, సుందరహరీష్, ఎంఈఓ -2 బి.చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు ఫెరొమోన్ ఉచ్చులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ ట్రైనీ సాయిసంజయ్

నెల్లిమర్ల రూరల్: ఫెరొమోన్స్ ఉచ్చులతో క్రిమి, కీటకాల నుంచి పంటలను రక్షించుకోవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ట్రైనీ తాళ్లపూడి సాయిసంజయ్ అన్నారు. మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామంలో ఫెరొమోన్స్ ఉచ్చుల వినియోగంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. పురుగులు, క్రిమికీటకాల నుంచి పంటను రక్షించుకోవాడానికి రైతులు ఎక్కువగా రసాయనాలను వినియోగిస్తున్నారని, ఫెరొమోన్స్ ఉచ్చులతో వాటిని సులభంగా నివారించవచ్చన్నారు. పైగా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. పంటల సాగులో వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, యాంత్రిక పద్ధతులకు రైతులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు

డెంకాడ: పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పెదతాడివాడ రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పంటల వివరాలు, రైతులు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూశారు. ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవడం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ పూడి నిర్మల పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామానికి చెందిన లోగిశ రామ్మూర్తి తన మనవుడు గణేష్‌తో కలిసి జీవనోపాధి నిమిత్తం విశాఖపట్నం వెళ్లారు. ఇద్దరూ దివ్యాంగులు కావడంతో గ్రామ వలంటీర్ మక్కువ భాగ్యలక్ష్మి ఆదివారం విశాఖపట్నంలోని మధురవాడ వెళ్లి తాత, మనవుడికి పింఛన్ డబ్బులు అందజేసింది. దీంతో వారిద్దరూ ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

జంగిల్ క్లియరెన్స్



రహదారి మలుపు వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పోలీసులు

నెల్లిమర్ల: రహదారి మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని ఎస్సై పి.నారాయణరావు సూచించారు. స్థానిక జ్యూట్ మిల్ బ్రిడ్జ్ వద్ద రహదారి మలుపులో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి పిచ్చిమొక్కలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై పి.నారాయణరావు మాట్లాడుతూ.. రహదారి మలుపుల వద్ద వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాహనాన్ని జాగ్రత్తగా నడపాలని సూచించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పూసపాటిరేగ: మండల పరిషత్ కాంప్లెక్స్ వద్ద పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు



భోగాపురం: విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మానవహారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు



విజయనగరం రూరల్: సర్వజన ఆస్పత్రి వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో సైనిక పాఠశాల విద్యార్థులు

స్వచ్ఛభారత్ నిర్మాణంలో.. మేము సైతం..

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అక్టోబర్ ఒకటో తేదీన ప్రతీ పౌరుడు ఒక గంట సేపు శ్రమదానం చేయాలని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని చెత్త రహిత భారతదేశ(గార్బేజ్ ఫ్రీ ఇండియా) నిర్మాణంలో భాగస్వాములయ్యారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని, అందుకు అందరి సహకారం అవసరమని వక్తలు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం ప్రధాన రహదారులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల ఆవరణాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



విజయనగరం ఫోర్ట్: వన్ స్టాఫ్ సెంటర్ వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ పి.చిన్మయిదేవి, తదితరులు



భోగాపురం: పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



పూసపాటిరేగ: సీహెచ్ అగ్రహారంలో స్వచ్ఛతాహి ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు



విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



నెల్లిమర్ల: వృద్ధులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు



నెల్లిమర్ల: పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు



డెంకాడ: పినతాడివాడలో రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు, తదితరులు



నెల్లిమర్ల: మిమ్స్ పరిసరాల్లో వ్యర్థాలను తొలగిస్తున్న కళాశాల డీన్ లక్ష్మీకుమార్, తదితరులు



విజయనగరం రూరల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హి సేవా..



నెల్లిమర్ల రూరల్: సచివాలయ సిబ్బందితో కలిసి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొని పిచ్చిమొక్కలను తొలగిస్తున్న టూరిజం బోర్డు స్టేట్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు

ప్రజాధనం దోచేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- ఈ నెల 11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజాధనానికి ట్రస్టీగా ఉండాల్సి చంద్రబాబునాయుడు స్కిల్ డవలెప్‌మెంట్ నిధులను నొక్కేయడంలో తన స్కిల్‌ను ప్రదర్శించారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి?', 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్కిల్ డవలెప్‌మెంట్ స్కాం జగరలేదని చంద్రబాబు, టీడీపీ మాట్లాడటం లేదని, అందులో సాంకేతిక కారణాలు వెతుక్కుని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ నెల 11 నుంచి ప్రతీ ఇంటికీ వెళ్లి మళ్లీ రాష్ట్రానికి జగనే ఎందుకు సీఎంగా కావాలో ప్రజలకు వివరించాలని సూచించారు. చొల్లంగిపేట సచివాలయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా జగన్ ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట సలహాలు అందిస్తున్నారని వివరించారు. వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న విషయం ప్రజలకు తెలిసిందే అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పీహెచ్‌సీలో మందులు కాకుండా వేరుగా మందులు అందిస్తున్నారని చెప్పారు. విశాఖ పరిపాలనా రాజధాని ప్రకటించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, ప్రహరీ గోడ పనులు జరుగుతున్నాయన్నారు. పొదుపు సంఘాల మహిళలకు విడత వారీగా రుణమాఫీ చేస్తున్నారని తెలిపారు. 45 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆర్థికంగా చేయూతను ఇస్తున్నారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని వివరించారు. ఇందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారధులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీకేఎం పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సీకెఎం)లో ఈనెల 4న జరగనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఏర్పాట్లను కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ముందుగా కందర్పకాలనీలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని భావించారు. వసతులను దృష్టిలో ఉంచుకుని వేదికను సీకేఎం పాఠశాలకు మార్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

జమ్ములో గ్రామదేవత పండగ



మరిడమ్మ తల్లికి పసుపు, కుంకుమలు సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

విజయనగరం: నగర శివారు ప్రాంతమైన జమ్ము గ్రామంలో గ్రామదేవతల పండగలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మరిడమ్మ తల్లికి పసుపు, కుంకుమలు సమర్పించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జమ్ము గ్రామం నుంచి మచ్చకొండ వరకు ఘటాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ నెల 10వ తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఆత్తి సత్యకుమారి, ఏఎంసీ చైర్మన నడిపేన శశిభార్గవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యతో సెల్ఫ్‌కాన్ఫిడెన్స్

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటే, బాక్సింగ్ వంటి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే తనలాంటి తల్లులకు ధైర్యంగా ఉంటుందని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2023(జూనియర్స్) ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు తదితరులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, 63 ఏళ్ల వయసులోనూ మన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గంటపాటు జలాసనం వేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా విద్యలకే కాక, క్రీడలకూ పెట్టింది పేరని గుర్తుచేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బాలలను అభినందించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ.. కరాటే వంటి ఆత్మరక్షణ క్రీడలు పిల్లల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను పెంచేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నగరాభివృద్ధి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.కోటి వ్యయంతో గంటస్తంభం–అంబేడ్కర్ జంక్షన్ రోడ్డు నిర్మాణం



కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని గంటస్తంభం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. బీటీరోడ్డు ప్రారంభానికి విచ్చేసిన కోలగట్లకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణులు మాట్లాడుతూ.. నగర సుందరీకరణకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇప్పటికే నగరంలోని అనేక ప్రధాన రహదారుల విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. గణేష్ కోవెల నుంచి ఎస్‌బీటీ మార్కెట్ వరకు, మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు, ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి పాల్‌నగర్ వరకు ఇలా అనేక రహదారులు నూతనంగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. త్వరలో అంబటి సత్రం రహదారిని కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని అందిస్తుండగా, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నగరాభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, కోలగట్ల వీరభద్రస్వామిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, విజయనగరం కార్పొరేషన్ ఈఈ కే శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, ఎం కే బి శ్రీను, కాళ్ల సూరిబాబు, కనకల గిరి, అప్పారావు, ప్రకాశ్ సిల్క్ అధి నేత ఉప్పు ప్రకాశరావు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పడాల రమణ

విజయనగరం పూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ కోరారు. స్థానిక అమర్‌భవన్‌లో ఆదివారం మజ్జి ఆదిబాబు అధ్యక్షతన ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) విజయనగరం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్.రంగరాజు, జిల్లా అధ్యక్షుడిగా మజ్జి ఆదిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలి గౌరినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులుగా గురువా రెడ్డి, వి.శంకరరావు, సహాయ కార్యదర్శులుగా పులిబంటి శ్రీనివాసరావు, కెల్ల సూరినాయుడు, కోశాధికారిగా పురం అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, విజయనగరం, కొత్తవలస, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి మండలాల నుంచి పలువురు కార్మికులు పాల్గొన్నారు.

82 శాతం పింఛన్ల పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛన్ పంపిణీ శరవేగంగా సాగింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 82 శాతం లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6069 మంది లబ్ధిదారులకు గాను 4,951 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషిచేయాలి



కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవలో పాల్గొన్న బీజేపీ నాయకులు

విజయనగరం టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి జలాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొబ్బిలి శ్రీను, బూర్లె శ్రీధర్, అప్పలరాజు, పాణంగిపల్లి అశోక్, అల్లూరి రామకృష్ణరాజు, ఇమంది సుధీర్, గిరిబాబు, రమేష్, దుక్కా ఆదినారాయణ, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.